# క్రికెట్ కలాపం!

భామాకలాపంలాంటి క్రికెట్ కలాపానికి బ్రహ్మ విష్ణు మహేశ్వరులు కలర్ టి.వీ.ల ద్వారా వివిధ దేశాలవారు ఆడే క్రికెట్ వన్డే మేచ్‌లను తిలకించి సంబరపడుతూ... తమ లోకాల్లోనూ ఈ ఆట ఆడాలని ఉబలాటపడ్డారు!

ఆలోచన వచ్చిందే తడవు త్రిమూర్తులు వైకుంఠంలో గల శ్రీహరి ఎ.సి. మీటింగ్‌హాల్లో సమావేశమైనారు. క్రికెట్ మేచ్‌లను తాము నిర్వహించే విషయమై కూలంకషంగా చర్చించి ఒక నిర్ణయానికొచ్చారు!

ఏఏ బాధ్యతలు... ఎవరెవరికి వప్పగించాలి అనే విషయమై ఒక రిజల్యూషన్ పాస్ చేసి ఆయా అధిపతులకు తెలీచేయటమేకాక... సెల్‌ఫోన్ ద్వారా కూడా వారికి వర్తమానం పంపారు.

మొత్తం మూడు వన్డేలు ఆడాలనీ... ఒకటి వైకుంఠంలో... రెండవది కైలాసంలో... మూడవది చివరిదీ అయ్యిన మేచ్ ఇంద్రలోకంలోనూ ఆడాలని నిర్ణయించిన వెంటనే శ్రీహరి విశ్వకర్మకోసం కబురంపాడు.

ఉరుకులు పరుగులు మీద విశ్వకర్మ శ్రీహరి ముందుకొచ్చి వాలాడు. చేతులు కట్టుకు నిలబడి అతివినయంగ 'దేవదేవా తమరు నన్ను రమ్మని పిలిపించిన కారణము వివరించ ప్రార్థన' అడిగేడు.

'విశ్వకర్మా! నీతో పనిపడిందయ్యా!'

'శలవీయండి స్వామీ-'

'మనలోకములందునూ భువిపై సీజనల్‌గ వివిధ దేశాల్లో కన్నుల పండుగ్గా ఆడే క్రికెట్ ఆటను ఆడతలిచాము. నీవు వెనువెంటనే పరమశివుడిని... దేవేంద్రుడినీ కల్సుకుని తగినంత వారి ఆధీనంలో గల ప్రభుత్వ భూమిని స్టేడియం నిర్మాణానికి కేటాయించమని కోరి... వెనువెంటనే కుబేరుని వద్దకువెళ్ళి... తగినంత ధనము సమకూర్చమని అడిగి నీవు నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించాలి!... అర్థమైనదా?-

శ్రీహరి మాటలు శ్రద్ధతో విన్నవాడై తల ఆడించి 'భూమి కేటాయింపు విషయమై తమరు పరమశివునితోను... దేవేంద్రునితోనూ చెప్పారు కదా దేవా... లేకున్న వారికి ఎటువంటి ఆదేశాలు తమరు ఇవ్వలేదని నన్ను ముప్పతిప్పలు పెట్టి మూడుచెరువుల నీళ్ళు తాగించెదరు... అంతియేకాదు స్వామీ! కుబేరునితో డబ్బు తగినంత ఇమ్మని కూడా

అదేశించండి! లేకున్న స్టేడియం నిర్మాణము పనులు ఆరంభించుట క్లిష్టమగును...'

'అన్ని ఏర్పాట్లూ చేసితిని! నీవు వారిని కలిసి పని విషయము చూడుము...'

'అటులనే! తమ ఆనతి!' అన్చెప్పి విశ్వకర్మ అదృశ్యమాయెను.

★★★★★

భూలోక వాసులైన మానవులు ఆడు క్రికెట్ ఆటను దేవలోకములో ఆడుటకు అభ్యంతరము తెలుపుచూ... ఇలాంటి క్రీడలు హెవెన్ ఎథిక్స్‌కు వ్యతిరేకమని... త్రిమూర్తులు తీసుకున్న ఏకపక్ష నిర్ణయం చెల్లదనీ... అఖిలపక్ష సమావేశం నిర్వహించి అన్నిపార్టీల వారితో స్టేడియం నిర్మాణం... అగు ఖర్చు... ఆడవలసిన అవసరం కలదో లేదోనే విషయాలను చర్చించాలనీ ప్రతిపక్షాలు పట్టుబట్టినయ్.

స్టేడియాలు నిర్మించే స్థలాలు ఏవక్కరి అబ్బ సొమ్మూకాదని... ముక్కోటి దేవతలకు వాటిపై నిర్ణయాధికారము కలదనీ... అప్పటివరకు ఈ ప్రతిపాదన నిలువరింప చేయాలనీ ప్రతిపక్షాలు గొంతుచించుకున్నయ్!

అక్కడితో ఆగక... ప్రతిపక్షాలన్నీ ఏకమై నినాదాలు ఇచ్చుచూ... ప్లేకార్డు ప్రదర్శన సాగించటంతో విషయము జటిలమౌతుందేమోనే శంక శ్రీహరి మనంబును కలవరపరచసాగెను.

ఇది ఇటులుండ... విశ్వకర్మ తాను ప్రముఖ దేశాలు పర్యటించి... ఆయాదేశాల క్రికెట్ క్లబ్ కమిటీని కలిసి ఏవిధంగ స్టేడియం నిర్మాణం... పిచ్ వుండవలసిన తీరు వగైరా విషయాలు సేకరించి వచ్చుటకు... టూర్ అడ్వాన్స్ శాంక్షన్ చేయుచూ... వెళ్ళివచ్చుటకు అనుమతినీ ఈయవలసిందిగా... శ్రీహరికి డి.ఓ. లెటర్ వ్రాయుట జరిగింది.

విశ్వకర్మ రాసిన డి.ఓ. లెటర్ చూచి చదివి శ్రీమన్నారాయణుడు మండిపడెను. శ్రీహరికి అరికాలిమంట నెత్తికెక్కింది. వెంటనే సెల్‌ఫోన్ ద్వారా విశ్వకర్మతో మాట్లాడి డి.ఓ. లెటర్ రాసినందుకు ముఖం వాచేట్లు చీవాట్లు పెట్టెను. లెటర్స్ రాయనవసరంలేదనీ... ఓరల్ ఇన్‌స్ట్రక్షన్స్ చాలనీ... వెంటనే పుష్పక విమానమును గైకొని విదేశీ పర్యటన ముగించుకు రావలసిందిగా విశ్వకర్మను ఆదేశించాడు శ్రీహరి.

★★★★★

శ్రీహరి మనంబున ఆలోచన తళుక్కున మెరుపువలె మెరవటంతో వెంటనే కుబేరునకు కబురంపెను.

రెక్కలు కట్టుకువచ్చి వాలిన కుబేరుని చూచి 'కుబేరా! మనదేవలోకాలందునూ

క్రికెట్ క్రీడ ఆడవలెనని తలంచి అందుకు తగిన నిర్ణయము తీసుకొంటిమి. ఈ విషయంలో సువర్ణముతో పాతిక క్రికెట్ బ్యాట్స్... రజితముతో వేయి బంతులు... పంచలోహాలతో బెయిల్స్ స్టంప్స్ పన్నెండు జతలు చేయించవలసి యున్నది కావున అందుకు కావలసిన బంగారాన్ని, వెండినీ... ఇతర లోహములను వెంటనే విశ్వకర్మకు అందచెయ్- పైగా అతను భూలోకమునకు వెడలుచున్నాడు కావున... వాటి సైజు... బరువు... చుట్టుకొలత... ఎత్తులు మొదలగు విషయములను వివరముగా తెల్సుకుని రమ్మని కబురుపెట్టుము. నేను చెప్పెనని చెప్పి ఆ పని పూర్తి చేసుకొని రమ్మనుము' వివరంగ చెప్పాడు.

శ్రీహరి చెప్పిన విషయమంతయూ శ్రద్ధాసక్తులతో విన్న కుబేరుడు తలవూపి అక్కడినుండి వెడలె.

ఇంతలో ద్వారపాలకులు వచ్చి శ్రీహరికి చేతులు జోడించి 'దేవదేవా!... ప్రతిపక్షాలన్నియు నల్ల 'బేడ్జీలు' ధరించి మన వైకుంఠ ద్వారాము వద్ద చేరి నినాదములు ఇచ్చుచు... నిరసన ప్రదర్శనలు చేయుచున్నారు. టెంట్లు వేసి నిరాహారదీక్షకు సైతం పూనుకొనిరి...' విన్నవించిరి.

'అటులనా? పరిస్థితి శృతిమించినది... వీరినందరిని అరెస్ట్ చేయించి కొద్దికాలము జైలులో తోయించవలెను అని మనంబున తలంచిన శ్రీహరి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వారిని లైన్లోకి తీసుకున్నవాడై 'ఓయీ రక్షక భటాధిపతీ! జరుగుచున్నది కాంచవేల?... నీలో అలసత్వము పెరిగినది. నీవు వెనువెంటనే వైకుంఠ ద్వారము ముందు నిరాహారదీక్ష చేయుచు నిరసన ప్రదర్శనలిచ్చుచున్న ప్రతిపక్షాల సభ్యులందరినీ లారీల కెక్కించి జైళ్ళలో పెట్టుము. లాఠీఛార్జ్ మాత్రము చేయవలదని తెల్సుకో... వారంతా దేవగణముచే ఎన్నుకొనబడిన ప్రతినిధులు కదా?!... మన మూడు స్టేడియముల నిర్మాణము పూర్తి అగువరకు వారందరిని జైలులోనే వుండవలె? తెల్సినదా? చెప్పినటుల చేయుము అని సెల్ ఆఫ్ చేశాడు.

హమ్మయ్య! ప్రతిపక్షాలతో తలనొప్పి తాత్కాలికముగ తొలగింది... అని గట్టిగా వూపిరి పీల్చుకొనెను.

క్రికెట్ బోర్డు ఛైర్మన్‌గ యమధర్మరాజుని నియమించి ఎన్నికలలో గెలిచి పదవులు లేని ప్రతినిధులను కొందరిని ఎంచి బోర్డు మెంబర్స్ పదవులు కట్టబెట్టెను.

కలహభోజుడైన నారద మహర్షిని అంపైర్‌గ... నారదుడి సోదరుడైన తుంబురుడిని సెకండ్ అంపైర్‌గ నియమించవలెనని శ్రీహరి తలంచినవాడై... వెంటనే తన అభిప్రాయాన్ని శివునికి... ఇంద్రునికి తెలీపరచెను.

తమ అంగీకారము కోరకనే అంపైర్స్‌గ తమను నియమించనున్నారను విషయము గ్రహించిన నారద తుంబురులు కోపోద్రిక్తులై... పరుగు పరుగున తమ తండ్రిగారైన బ్రహ్మదేవుని వద్దకు చేరుకుని 'తండ్రీ! మమ్మీవిధముగ ఇన్సల్ట్ పాలుచేయుట సముచితము కాదు కదా?-' అని భోరుభోరున విలపించిరి.

అంతట బ్రహ్మ కుమారులిద్దరినీ శాంతపరిచి నచ్చచెప్పెను.

నారదుడు సంతుష్టమనస్కుడై తదుపరి కైలాసముకేగె! అచ్చోట పరమశివునిగాంచి 'శివదేవా! వెనకటికి ఎవడో నాడా దొరికినదని గుర్రమునే కొనవలెనని తలంచెనట... అటుల వున్నది మీ ఆలోచన...' చెప్పాడు.

'నారదా! నీ ఉపమానాలు కట్టిపెట్టి అసలు పాయింట్‌కిరా!... నీ డౌటేమిటో వివరించుము...' ప్రశాంతచిత్తంతో శివుడు అడిగె.

'మీలో ఎవ్వరికీ క్రికెట్ బ్యాటు ఎటుల పట్టుకొనవలెనో... ఎటుల బంతి విసరవలెనో... ఎటుల ఫోర్లు సిక్సర్లు బాదవలెనో... సెంచురీలు చేయవలెనో బొత్తిగా తెలియదు కదా?... ఆట రూల్సు తెల్సుకొనకుండా ఆడవలెననుకొనుట వెర్రితనమన్పించుచున్నది...'

'వెర్రి నారదా... నీకు మహతి మీటుతూ నారాయణ మంత్రము జపించుట తప్ప జనరల్ నాలెడ్జ్‌లో వెరీ వెరీ పూర్! వివిధ దేశములనుండి ట్రెయినర్స్‌ని ఇచటికి రప్పించి తర్ఫీదు పొందెదము. అది పెద్ద సమస్యా?'

'పరిహసించకండి శివదేవా... నాకింకొక డౌటు వుత్పన్నమైనది.'

'భూలోకవాసులు బహు ప్రాబ్లమ్‌మేకర్స్ శివదేవా? స్త్రీ వ్యామోహలాలసులు!... ఇచ్చట కొచ్చి మన ఇంద్రుని వద్దగల రంభ ఊర్వశి మేనక తిలోత్తమలను గాంచిరో... పుట్టి మునిగిపోవును. మన స్త్రీలను వారు... లైంగిక వేధింపులతో నానా అవస్థలపాలు చేయుదురు. అత్యాచారములకు పాల్పడెదరు. సామూహిక మానభంగమునకైననూ వెరవరు! అదియునూకాక భూలోకవాసులూ మద్యపాన ప్రియులే! మనలోకమున కేతెంచిన పిదప అమృతము కావలెనని గోల చేయుదురు...' చెప్తూ ఆగేడు నారదుడు.

'వారటుల చేసిన యమపురికంపెదము. మన యముండు వారి భరతము పట్టును!...'

శివుని సమాధానముతో స్థిమితపడిన నారదుడు అక్కడినుండి వెడలిపోయెను.

ఇంతలో విఘ్నేశ్వరుడు తండ్రి వద్దకు వచ్చి నమస్కరించి 'నాకునూ క్రికెట్ ఆట ఆడవలెనని కోరికగా నున్నది. తమ్ముడు కుమారస్వామిని జట్టులో చేర్చుకొనినారట కదా?- నేనేమో రన్స్ తీయలేను. మరి నా సంగతి ఎటుల?-' విచార వదనుడై అడిగెను.

'ఆందోళన చెందవలదు గణపతీ! నిన్ను థర్డ్ ఎంపైర్‌గ వుంచవలెనని నిర్ణయించితిమి! అదియే నీకు అన్నివిధముల సరియైన పదవి...'

తండ్రి మాటలకు పరవశమందినవాడై గణపతి తన మూషికవాహనముపై వెడలిపోయెను.

★ ★ ★ ★ ★

శ్రీదేవి (సారీ సినీనటి కాదు) శ్రీహరి పాదాలు వత్తుతూ 'స్వామీ! మీరు క్రికెట్ ఆడవలదు. ఆటలో మీరు గాయాలపాలైనచో... వైద్యము చేయించుటకై ధన్వంతరికి కబురుపెట్టవలసి వచ్చును. కట్టు కట్టిన శరీరముతో మిమ్ములను సేవించుట అత్యంత బాధాకరము నాధా...' వాపోయెను.

'చింతించవలదు లక్ష్మీ! ఒక్కమారు అటు భూలోకమువైపు దృష్టి సారింపుము. భారతదేశమునందు గల హైదరాబాద్ నగరమున గల ఒక ఇంట కూర్చుని సీరియస్‌గ పోటీకై కథను వ్రాయుచున్న నా భక్తుడు కన్పించుటలేదా? అతను కథారచనలో మేటి. కలియుగమున నేనవతరించినపుడు వాగ్గేయకారుడైన అన్నమయ్య నన్ను స్తుతించుచూ కీర్తించుచూ అనేకానేక పాటలు రాసి నాలో చివరికి ఐక్యమైన విషయము నీకు గుర్తున్నది కదా!!- ఆ విధముగనే ఈ కథా రచయిత మనోహరమైన కథలు రాసి పేరు ప్రతిష్టలు సాధించిన ఘనుడు. అతను... తన తనువు చాలించేలోపు త్రిమూర్తులపై క్రికెట్ ఆట గురించిన కథొకటి రాయవలెనని కుతూహలముగా నున్నదని మనంబున నన్ను స్మరించెను. అతని కలలో సాక్షాత్కరించిన నేను మాపై కథ వ్రాయుటకు అనుమతి ఒసంగితిని దేవీ! దాని సారాంశమే ఈ 'క్రికెట్ కలాపం' కథ. ఇది వాస్తవం కాదు. కానేరదు...' అన్చెప్పిన శ్రీహరి లక్ష్మీదేవిని బుజ్జగించెను.

'ఓ!... అదా కథ! కథే కాబట్టి ఫర్వాలేదు. నిజమేమోని భ్రమించి భయపడితిని...' లక్ష్మీదేవి చిరునవ్వు చిందించెను.

ఆ రచయిత పోటీకి పంపిన కథకు ప్రథమ బహుమతి వచ్చింది. ఈ విషయం తెల్సుకునేలోపే... అతను భౌతికంగ మనుష్యుల మధ్య లేడు. అప్పటికే అతనికి స్వర్గప్రాప్తి కల్గటంతో రచయిత ఆత్మను శ్రీహరి తనలో ఐక్యం చేసుకోవటం జరిగిపోయింది.

('ఆంధ్రప్రభ' దినపత్రిక 14/16-4-2010లో ప్రచురితం)